

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,64,687లు, బంగారం 300 మిల్లీగ్రాములు, వెండి 43 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



శ్రీక్షేత్రంలో అశోక అష్టమి

భువనేశ్వర్: పూరీలోని జగన్నాథ ఆలయంలో బుధవారం అశోక అష్టమి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. గర్భాలయంలో మూల విరాట్‌ల ప్రాతః ధూపసేవ అనంతరం ఈ ఉత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకనాథుని ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చారు.



పోరాట యోధుడు లక్ష్మణ నాయక్

- 10లో.

న్యూస్‌రీల్

సెంచూరియన్‌లో మంజార్‌-2023 ఉత్సవాలు



వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో గత 2 రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి స్టూడెంట్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్ మంజార్‌-2023 ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని టెక్కలి ఆదిత్య, సన్ డిగ్రీ, గాయత్రి, విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, కార్మెల్ హయ్యర్ సెకండరీ కళాశాల(కల్లట, హిరమండలం), పర్లాకిమిడి ప్రభుత్వ పాలిటెక్నిక్, కృష్ణచంద్ర గజపతి కళాశాలల నుంచి సుమారు 60మంది విద్యార్థులు హాజరయ్యారు. వివిధ సాంకేతిక, సాంకేతికేతర, ఆటలు, విద్య, సంస్కృతి, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డీఎన్ రావు ప్రసంగించారు. పీజీపీ కో-ఆర్డినేటర్ డాక్టర్ దేవిప్రసాద్ శత్పతి, సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రొ, డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాఢి, మంజార్ కన్వీనర్ డాక్టర్ సుశాంతకుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

యాత్రికుల బస్సు ప్రారంభం



యాత్రికుల బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ మిశ్రా, ఎమ్మెల్యే ప్రధాన్

కొరాపుట్: ప్రభుత్వ సాయంతో వయోజనులు తీర్థయాత్రకు బయలుదేరారు. ఈ మేరకు నవరంగ్‌పూర్‌లోని మిషన్‌శక్తి సమావేశ మందిరం వద్ద బస్సులను కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్ ప్రారంభ పూజలు చేసారు. ఈ బస్సులు రాయగడ జిల్లాకు చేరుకుని అక్కడ నుంచి రైలులో వెల్లూర్, తిరుపతి, శ్రీకాళహస్తి తదితర ప్రముఖ క్షేత్రాల్లో పర్యటించి, ఏప్రిల్ 2న తిరిగి వస్తారు. వీరి ఏర్పాట్ల కోసం ఆరుగురు అధికారులు వెంటే ఉంటారు. యాత్రలో వెళ్లే వయోజనులకు ప్రభుత్వమే ఉచితంగా పూర్తి సౌకర్యాలు కల్పిస్తోంది.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై కొరడా



కొరాపుట్‌లో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొరాపుట్: ట్రాఫిక్ ఉల్లంఘనలపై పోలీసులు కొరడా ఝులిపించారు. కొరాపుట్ జిల్లాలో ట్రాఫిక్ నియమాల అమలుపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై బుధవారం తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వాహనదారులపై రూ.4 లక్షల 11 వేలు జరిమానాగా వసూలు చేశారు. 392 మందిపై చలానా విధించారు. 47మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేశారు. 40 మందిపై ఎంవీ చట్టంతో కేసులు నమోదు చేశారు. తనిఖీలు ముమ్మరం చేస్తామని, ప్రతిఒక్కరూ విధిగా నిబంధలు పాటించాలని పోలీసు అధికారులు స్పష్టంచేశారు.

వీకే పాండ్యన్ సుడిగాలి పర్యటన



మిషన్‌శక్తి కేఫ్‌ను సందర్శిస్తున్న వీకే పాండ్యన్

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల, చిత్రకొండ సమితిల్లో 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ బుధవారం పర్యటించారు. మత్తిలి, ఖొయిర్‌పుట్ సమితులలో మంగళవారం పర్యటించిన ఆయన.. చిత్రకొండ సమితి లోని బొడపొడ పంచాయతీలో ఉన్న బీఎస్‌ఎఫ్ శిబిరంలో రాత్రి బస చేశారు. బుధవారం ఉదయం గురుప్రియ వంతెన పరిశీలించి, అక్కడి నుంచి చిత్రకొండలో మిషన్‌శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేఫ్‌లో అల్పాహారం చేశారు. అనంతరం చిత్రకొండ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. అలాగే మల్కన్‌గిరి కొండపై ఉన్న మల్లికేశ్వర ఆలయాన్ని సందర్శించి, అభివృద్ధి పనులపై అధికార్లతో చర్చించారు. మోటు పరిధిలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో ఆర్.వీనిల్‌కృష్ణ, కలెక్టర్ విశాల్‌సింగ్, అధికారులు పాల్గొన్నారు.

మే 10న ఝార్సుగుడ ఉప ఎన్నిక

- ఏప్రిల్ 13న అధికారిక నోటిఫికేషన్ విడుదల
- 20వరకు నామినేషన్ల స్వీకరణకు అవకాశం
- ఎన్నికల నియమావళి తక్షణ అమలు
- వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల అధికారి నికుంజ్‌బిహారీ



విలేకర్లతో మాట్లాడుతున్న సీఈఓ నికుంజ్‌బిహారీ ధల్





మోహన్ మాఝి



శరత్ పట్నాయక్

భువనేశ్వర్: ఝార్సుగుడ ఉప ఎన్నికకు సంబంధించి జాతీయ ఎన్నికల కమిషన్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న నవకిషోర్ దాస్ జనవరి 29న దారుణ హత్యకు గురైన నేపథ్యంలో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాన్ని భర్తీ చేసేందుకు మే 10న ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహించనున్నారు. 13న ఓట్లు లెక్కించి, ఫలితాలు వెల్లడిస్తారు. దీనికి సంబంధించి ఝార్సుగుడ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమల్లోకి వచ్చినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) నికుంజ్‌బిహారీ ధల్ వెల్లడించారు. దీనికి సంబంధించి ఏప్రిల్ 13న అధికారిక నోటిఫికేషన్ వెలువడనుండగా, అదే నెల 20 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 21న దస్తావేజుల పరిశీలన, 24 వరకు ఉపసంహరణకు అవకాశం కల్పిస్తారు. మే 10న పోలింగ్ నిర్వహించి, 13న ఫలితాలు వెల్లడిచడంతో పాటు 15లోగా ఉప ఎన్నిక ప్రక్రియ అంతా పూర్తి చేయాలని సీఈఓ వివరించారు. ఝార్సుగుడ నియోజకవర్గంలో మొత్తం 2,21,070మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 206వేర్వేరు ప్రాంతాల్లో 253 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు జిల్లా అధికారులకు ఆదేశించారు.

ఈవీఎంతో పోలింగ్

ఉప ఎన్నికలో ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాలతో పాటు వీవీ ప్యాట్‌లను వినియోగిస్తారు. ఈ మేరకు అవసరమైన పరికరాలను సిద్ధం చేశారు. దీనికి సంబంధించి తొలి విడత పరిశీలన ముగిసిందని సీఈఓ తెలిపారు. పోలింగ్ కేంద్రాల ప్రాంగణంలో ఓటర్ల కోసం మౌలిక సదుపాయాలు పుష్కలంగా అందుబాటులో ఉంటాయన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ర్యాంప్ వంటి సౌకర్యాలు పుష్కలంగా ఉంటాయని వివరించారు.

కోవిడ్ మార్గదర్శకాలు..

ఉప ఎన్నిక పురస్కరించుకుని కోవిడ్-19 ఆంక్షలు తొలగించిన నేపథ్యంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సమయానుకూలంగా జారీ చేసిన నిబంధనలు అమలు చేయడం జరుగుతుందని సీఈఓ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అనుక్షణం కోవిడ్-19 సంక్రమణ పరిస్థితిని సమీక్షించి, సత్వర చర్యలు చేపట్టి నికరమైన మార్గదర్శకాలు జారీ చేస్తుందన్నారు. రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సంప్రదింపులకు ఝార్సుగుడ నియోజకవర్గ ఉప ఎన్నిక శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

పోటీకి సిద్ధం: శరత్ పట్నాయక్

రాష్ట్ర ఆరోగ్యశాఖ మాజీమంత్రి నవకిషోర్ దాస్ మరణంతో ఝార్సుగుడ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ నియోజకవర్గ ఉప ఎన్నిక తేదీని ఎన్నికల సంఘం ప్రకటించడంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ పోటీకి పూర్తిగా సిద్ధంగా ఉన్నామని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ తెలిపారు. కంటాబంజి ఎమ్మెల్యే సంతోష్‌సింగ్ సలూజా నేతృత్వంలో ప్రత్యేక సభ్యుల కమిటీ ఈ ఉప ఎన్నిక అభ్యర్థిని ప్రతిపాదిస్తుందన్నారు. ఈ బృందంలో ఐదుగురు సభ్యులు ఉంటారని, వీరి నివేదికల పరిశీలన మేరకు పోటీలో ఉన్న వారిని ప్రకటిస్తామని వెల్లడించారు.

మేమూ సిద్ధమే: మోహన్ మాఝి

ఝార్సుగుడ ఉప ఎన్నికకు తామూ సిద్ధమేనని ప్రధాన ప్రతిపక్షం బీజేపీ చీఫ్ విప్ మోహన్ మాఝి తెలిపారు. ప్రస్తుతం బూత్ సాధికారత కార్యక్రమం చురుగ్గా సాగుతోందన్నారు. ఉప ఎన్నికకు బీజేపీ పూర్తిగా సిద్ధంగా ఉన్నామని, ప్రాంతీయ బీజేపీ వర్గీయులు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యూహాత్మక కార్యాచరణతో పార్టీ అధిష్టానం సరైన సమయంలో అభ్యర్థిని ఎంపిక చేసి, ప్రకటిస్తుందన్నారు.

గమ్యం చేరని లింగరాజు



లింగరాజు మహాప్రభువు రుకుణ రథయాత్ర



రుకుణ రథం ముంగిట కళాకారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన

భువనేశ్వర్: లింగరాజు మహాప్రభువు రుకుణ రథం సకాలంలో గమ్యం చేరలేక పోయింది. సూర్యాస్తమయం వేళ కావడంతో రథం లాగడం వాయిదా వేశారు. దీంతో రుకుణ రథం బొడ్డె బంకొ ప్రాంతంలో నిలిపి వేశారు. రథయాత్రలో భక్తులు అత్యంత ఉత్సాహంతో పాలుపంచుకున్నారు. యాత్ర పూజలు, సేవాదుల్లో ఉదయం నుంచి జాప్యం చోటు చేసుకుందని బ్రాహ్మణ నియోగుల సంఘం కార్యదర్శి బిరంచి నారాయణపతి తెలిపారు. సుమారు రెండున్నర గంటల ఆలస్యం కొనసాగింది. దీంతో బుధవారం సాయంత్రం 6:20 గంటలతో రథయాత్ర నిలిపి వేశారు. తదుపరి యాత్ర గురువారం నిర్వహిస్తారు. రథం ఆగిన బొడ్డె బంకొ నుంచి గురువారం మధ్యాహ్నం 2 గంటలకు రథం లాగడం ప్రారంభించి, సకాలంలో మాసీ మా మందిరం గమ్యం చేర్చుతామన్నారు. ఉత్సవ సేవాదుల్లో జాప్యంతో రథం పైకి ఉత్సవ మూర్తుల తరలింపు ఆలస్యంగా మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభించారు. ఈ తంతు ముగించి సాయంత్రం 5:23 గంటలకు రథం లాగడం ప్రారంభించారు.

రఘునాథ పాత్రోకు సత్కారం



రఘునాథ పాత్రోను సన్మానిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ఒడియా భాష, సంస్కృతి, సాహిత్య విభాగం, గురు కేళుచరణ్ మహాపాత్రో పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లోని ఉత్కళరంగ మంచ్ వేదికలో సంగీత మహోత్సవం నిర్వహించారు. ఇందులో పర్లాకిమిడికి చెందిన ప్రముఖ సంగీత దర్శకులు రఘునాథ పాత్రో నిర్వహించిన సంగీత విభావరి విశేష ప్రేక్షకాదరన పొందింది. హార్మోనియంలో బాలకృష్ణ జెన్నా, మృదంగం సీతాకాంత జెన్నా, వేణుగానం సౌమ్యరంజన్ జోషి సహకరించారు. ఈ సందర్భంగా సంగీత గురువులు గోపాలచంద్ర పండా, పద్మశ్రీ శ్యామమణీ దేవి, గురు ధనేశ్వర స్వాని, సుభాష్‌చంద్ర ఆచార్య, తరిణీ మిశ్రా తదితరులు రఘునాథ పాత్రోను దుశ్శాలువ, మొమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక క్రియేటివ్ ఆర్ట్స్ అధ్యక్షుడు నృసింహచరణ్ పట్నాయక్, రంగస్థల నటులు దేవేంద్ర దాస్, భక్తి సంగీత సంసద్ కార్యదర్శి పూర్ణచంద్ర తదితరులు అభినందనలు తెలియజేశారు.

21కిలోల గంజాయి స్వాధీనం

కొరాపుట్: గంజాయి అక్రమ రవాణాలను కొరాపుట్ పోలీసులు అడ్డుకున్నారు. సునాబెడా పోలీసు పరిధిలోని జడాగుడా గ్రామానికి చెందిన రాజు బొత్ర 21.5 కిలోల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు.. అతని కదలికలు పసిగట్టి బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అతని నుంచి సరుకును సీజ్ చేసుకొని, కేసు నమోదు చేయడంతో పాటు కోర్టుకు తరలించారు.

అనుమానాస్పదంగా మూడో కపోతం



పావురాన్ని పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

భువనేశ్వర్: భద్రక్ జిల్లా బాసుదేవ్‌పూర్ మండలం బలిమెదా గ్రామంలో మరో అనుమానాస్పద పావురం చిక్కింది. దీని కాలికి రెండు ప్లాస్టిక్ రింగులు తగిలినట్లు గుర్తించారు. స్థానికులు ఈ పావురాన్ని బంధించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. గూఢచర్య కార్యకలాపాల కోసం దీనిని ప్రయోగిస్తున్నట్లు సర్వత్రా అనుమానం వ్యక్తమవుతోంది. బలిమెదా గ్రామం ఎంఈ పాఠశాల సమీపంలో మంగళవారం సాయంత్రం పెనుగాలులు వీచిన సమయంలో సుశీల్ మహంతి అనే వ్యక్తి ఇంటిముందు పావురం తిరుగాడుతూ కనిపించింది. ఈ నేపథ్యంలో కపోతాన్ని పట్టుకొని పరిశీలించగా కాళ్లకు రెండు ప్లాస్టిక్ రింగులు ఉన్నట్లు గమనించారు. ఎడమ కాలిపై దిక్‌ఖాన్ యాదవ్ అని రాసి, నంబర్ కూడా ఉంది. కుడి కాలికి జోడించిన రింగుపై ఒక సంఖ్య, పక్షి గుర్తున్నట్లు గుర్తించారు. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించగా, అనంతరం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఘటనా స్థలంలో ధామ్రా ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. రాష్ట్రంలో ఇదే నెలలో ఇది మూడో ఘటన. ఈనెల 6న జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ తీరంలో ఫిషింగ్ బోటులో పావురం పట్టుబడగా, 15న పూరీ జిల్లా అస్తరంగ్ మండలం నాస్‌పూర్ గ్రామంలో కాళ్లకు ఇత్తడి, ప్లాస్టిక్ రింగులతో ట్యాగ్‌లు అమర్చిన మరో పావురం పట్టుబడింది. పారాదీప్ తీరంలో తొలుత పట్టుబడిన పావురం కాళ్లకు కెమెరా, మైక్రోచిప్ వంటి పరికరాలను అమర్చినట్లు గుర్తించారు.

రాయగడ జిల్లాకు వైద్యుల నియామకం



రాయగడ జిల్లా కేంద్ర ఆస్పత్రి

రాయగడ: ఆదివాసీ, హరిజన జిల్లాగా గుర్తింపు పొందిన రాయగడకు మరిన్ని వైద్య సౌకర్యాలు మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో జిల్లాకు కొత్తగా ఐదుగురు వైద్యులను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ బుధవారం ప్రకటన వెల్లడించింది. వైద్యుల కొరత కారణంగా జిల్లాలో వైద్య సేవలు మృగ్యమవుతున్నాయని ఇటు నాయకులు, అటు జిల్లా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంది. కొత్తగా నియమితులైన వారిలో జిల్లా కేంద్రాస్పత్రికి డాక్టర్ లాడి రమేష్‌ను నియమిస్తున్నట్లు ప్రకించగా, గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి డాక్టర్ నిహార్‌రంజన్ సాహు, డాక్టర్ శ్రీధర్ భోలో, డాక్టర్ అరుణ్‌కుమార్ బిసోయి, డాక్టర్ పృథ్వీరాజ్ ప్రధాన్ లను కేటాయించారు. కొద్ది రోజుల క్రితం రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ తోపాటు బిజూ స్వాస్థ్య సమితి రాష్ట్రశాఖ సలహాదారుడు సుధీర్‌కుమార్ దాస్ తదితరులు స్థానిక సమస్యలను రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ షాలినీ పండిట్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

దేశ గౌరవ ప్రతిష్టలు పెంచండి

- ఉన్నత విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం
- బరంపురం వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ గణేషీలాల్
- పలువురు ఉత్తమ విద్యార్థులకు ఉత్తీర్ణత పట్టాలు అందజేత



వీసీ గీతాంజలి దాస్‌ను సత్కరిస్తున్న గవర్నర్ గణేషీలాల్



గవర్నర్‌తో పట్టాలు పొందిన విద్యార్థులు



స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, మేధావులు

బరంపురం: డిగ్రీ పట్టాలు అందుకున్న వారంతా మిగతా వారికి ఆదర్శప్రాయులుగా నిలవాలని రాష్ట్ర గవర్నర్, విశ్వ విద్యాలయాల ఛాన్సలర్ గణేషీలాల్ ఆకాంక్షించారు. వివిధ రంగాల్లో స్థిరిపడి, ఉత్తమ సేవలతో దేశ గౌరవ ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని సూచించారు. నగరంలోని బంజవిహార్‌లో బిజూ పట్నాయక్ ఆడిటోరియం ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన బరంపురం విశ్వవిద్యాలయం 24వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వర్సిటీ వీసీ గీతాంజలి దాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దక్షిణ ఒడిశాకు, కళింగ చరిత్రకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అశోకుని పాలనలో భువనేశ్వర్ ధౌలి, గంజాం జావ్‌గడా కళింగ యుద్ధం, బౌద్ధ చారిత్రత్మకమైన గుర్తులు ఎన్నో ఉన్నాయని తెలిపారు. అలాగే దేశంలో మొదటిసారిగా 1936లో ప్రత్యేక ఒడిశా రాష్ట్ర ప్రారంభమైందని గుర్తుచేశారు. ఈ ప్రాంతం సంస్కృతి, కవులు, కళా, నటక, సంగీత సాహిత్యాల్లో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. 1943లో రాష్ట్రంలో రవిన్‌స్సా, కల్లికోట్, పల్లా మహరాజా కళాశాలు మాత్రమే ఉండేవని పేర్కొన్నారు. తొలుత ఉత్కళ విశ్వవిద్యాలయం ప్రారంభం కాగా.. 1967లో స్థానిక ప్రముఖులు, ప్రజల డిమాండ్ మేరకు ఉపేంద్ర బంజవిహార్‌లో బరంపురం విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ప్రస్తుతం 139 కళాశాలల్లో..

తొలుత బరంపురం వర్సిటీ 5 కళాశాలకు అనుబంధంగా ఉండగా, ప్రస్తుతం యూనివర్సిటీ కేంద్రంగా సుమారు 139కళాశాలు విద్యా బోధన అందిస్తున్నట్లు గవర్నర్ ప్రకటించారు. బరంపురం వర్సిటీ ఎంతోమంది మేధావులు, కళాకారులు, రచయితలు, కవులు, పారిశ్రామికవేత్తలు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ ప్రముఖులను దేశానికి అందించడంతో పాటు విద్యా కల్పవృక్షంగా ప్రసిద్ధి చెందిందని ప్రశంసించారు. ప్రస్తుతం డాక్టరేట్‌లు, డిగ్రీ పట్టాలు అందుకున్న మేధావులంతా మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రపంచీకరణ యుగంలో ప్రపంచ దేశాలతో మన దేశం పోటీ పడుతోందని, దీనికి అనుగుణంగా యువతీ, యువకులు ఉన్నత ప్రమాణాలతో సంసిద్ధం కావాలని సూచించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ గీతాంజలీ దాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు యూజీసీ నిధులతో వర్సిటీ ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. అనంతరం పలువురు పట్టభద్రులకు డిలీట్, డీఎస్ డిగ్రీ పట్టాలు ప్రధానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.కౌంసిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం



అధ్యక్షురాలు మినతి రథ్, బార్ నూతన కార్యవర్గం

బరంపురం: జిల్లా కోర్టు ప్రాంగణంలోని గంజాం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదుల సంఘం ప్రమాణ స్వీకారం బుధవారం చేపట్టారు. నూతన అధ్యక్షురాలిగా మినతి రథ్, ఉపాధ్యక్షుడిగా ఎం.చంద్ర శేఖర్, కార్యదర్శిగా శివనారాయణ సాహు, సహాయ కార్యదర్శిగా తపన్‌కుమార్ సాహు లతో ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది అక్షయ్‌కుమార్ పట్నాయక్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ బరంపురంలో హైకోర్టు స్థాయి బెంచ్ స్థాపన కోసం గత కొంతకాలంగా న్యాయవాదులు ఆందోళన చేపడుతున్నట్లు గుర్తుచేశారు. దీనిని మరింత తీవ్రతరం చేసి, బెంచ్ ఏర్పాటు లక్ష్యంగా కృషి చేస్తామని, దీనికి అంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నవమి ఉత్సవాలకు నేడే శ్రీకారం

- జయపురం యువరాణిని ఆహ్వానించిన హిందూ సమాజ్ ప్రతినిధులు



జయపురం రాణి సబితాదేవిని ఆహ్వానిస్తున్న హిందూసమాజ్ ప్రతినిధులు



శ్రీరామనవమి ఊరేగింపు రూట్ మ్యాప్‌పై చర్చిస్తున్న పోలీసు అధికారులు

జయపురం: పట్టణంలో ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే శ్రీరామ నవమి ఉత్సవాలను ఈ ఏడాది కూడా ఘనంగా జరిపేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో జయపురం హిందూ సమాజ్ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో సబ్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు పాల్గొనున్నట్లు సమాజ్ ప్రతినిధులు తెలిపారు. అలాగే నవమి ఊరేగింపులో పాల్గొవాల్సిందిగా కోరుతూ జయపురం మహారాణి సబితా దేవీని బుధవారం ఆహ్వానించారు. దీనిపై ఆమె అంగీకారం తెలిపినట్లు సమాచారం. మరోవైపు ఉత్సవ యాత్ర పట్టణంలోని పవర్ హౌస్ కాలనీ నుంచి పలు వీధుల్లో జరగనుంది. దీనికి సంబంధించి రూట్ మ్యాప్‌పై సబ్ డివిజన్ పోలీసు అధికారి హరి బీసీ, పట్టణ పోలీసు అధికారి సమ్మిత్ బెహరా, ఐఐసీ సంజీవ్ చర్చించారు. మరోవైపు వందేళ్లకు పైగా శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్న జయపురం జమాల్ శ్రీరామాంజనేయ మందిర కమిటీ ఈనెల 30 నుంచి జరుగనున్న నవరాత్రి కల్యాణ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలకు విస్తృతంగా సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా గురువారం ఉదయం 7.40 గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాలను తిరువీధులులో ఊరేగిస్తామని కమిటీ అధ్యక్షుడు రాజా తెలిపారు. 10.20 గంటలకు విఘ్నేశ్వర పూజ, కలశ స్థాపన, అంకురార్పణ, అఖండ దీపారాధన చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఏప్రిల్ 1న ఉదయం 9.30 గంటలకు సీతారాముల కల్యాణాన్ని వారణాసి సత్యనారాయణ, సుంకర ఈశ్వరరావు సహకారంతో ఆలయ ప్రధానార్చకులు గన్నవరపు వెంకటరమణ శర్మ నిర్వహించనున్నారని వెల్లడించారు. 6న లలితా సహస్రనామ కుంకుమార్చన, పుష్పార్చన, 7న ఉదయం 10.30 మద్ది సోదరుల ఆధ్వర్యంలో స్వామివారి పట్టాభిషేకం, 8న పూర్ణాహుతి హోమం, అనంతరం కలశ ఉద్వాసన పూజలు జరనున్నాయని వివరించారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

31న మన్యం బంద్



మన్యం బంద్‌కు సంబంధించిన గోడపత్రికలు విడుదల చేస్తున్న గిరిజన నాయకులు

గుమ్మలక్ష్మీపురం: గిరిజనేతరులైన బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దన్న డిమాండ్‌తో ఈ నెల 31న మన్యం బంద్ పాటిస్తున్నట్టు ఏపీ గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ, బిడ్డిక శంకరరావు, మండంగి సన్యాసిరావు, మండంగి భూషణరావు, కె.మల్లేశ్వరరావు, పాలక క్రాంతి కుమార్ తెలిపారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం గిరిజన సంఘం కార్యాలయంలో బంద్‌కు సంబంధించిన గోడ పత్రికలను బుధవారం ఆవిష్కరించారు. గిరిజనుల శ్రేయస్సును కోరి నిర్వహించతలపెట్టిన బంద్‌కు వ్యాపారులు, మోటారు కార్మికులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఈదురు గాలుల బీభత్సం



విరిగిన విద్యుత్ స్తంభాలు

సీతంపేట: సీతంపేట ఏజెన్సీ పూతికవలస పంచాయతీ పరిధిలోని నడిమిగూడ పరిసరాల్లో బుధవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గ్రామంలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. జీడి, మామిడి, అరటి తోటలు నేలకొరిగాయి. పంటనష్టం జరగడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

సీతారాముల వర్ణచిత్రం



సీతారాముల వర్ణచిత్రం

గరుగుబిల్లి: శ్రీరామనవమిని పురస్కరించుకుని గరుగుబిల్లి మండలం నాగూరుకు చెందిన పల్లపరిశినాయుడు వేసిన సీతారాముల వర్ణచిత్రం భక్తులను ఆకర్షిస్తోంది. ఆయన వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైనా, నఖచిత్రకారుడిగా గుర్తింపు పొందారు.

సంపూర్ణ హక్కులు కల్పించేందుకే రీ సర్వే



రీసర్వేపై ఆరా తీస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సాగుచేసిన భూములపై సంపూర్ణ హక్కులు కల్పించడమే వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. గరుగుబిల్లి మండలం కొంకడవరం పంచాయతీ, సీతారాంపురం గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వేను బుధవారం పరిశీలించారు. రైతులు అందజేసిన వినతులను స్వీకరించాలని, రైతులకు ఉండే అనుమానాలు, అపోహలను నివృత్తి చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జేసీ ఒ.ఆనంద్, ఆర్డీఓ కె.హేమలత, తహసీల్దార్ రఫీజాన్ ఉన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

విజయనగరం టౌన్: స్థానిక తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న సేనాపతి పల్లవి ఖేలో ఇండియా జూనియర్ ఉమెన్స్ నేషనల్ ర్యాంకింగ్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ 2023లో 64 కిలోల విభాగంలో బంగారు పతకం, సీనియర్ విభాగంలో రజతపతకం సాధించింది. ఈ మేరకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ఆవరణలో పల్లవిని పుష్పగుచ్ఛంతో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లవి అంతర్జాతీయ స్థాయిలో రాణించి మనదేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి.సాయి దేవమణి, ఎన్‌సీసీ అధికారిణి కెప్టెన్ ఎం.సత్య వేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యంతరాలను తెలియజేయాలి

పార్వతీపురం: ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయసంస్థ ద్వారా సరఫరా చేయనున్న మూడు చక్రాల మోటార్ వాహనం కోసం అభ్యర్థులను జిల్లా కమిటీ ఎంపిక చేసింది. ఎంపిక చేసిన జాబితాను జిల్లా వెబ్‌సైట్ పార్వతీపురం మన్యం.ఏపీ.జీఓవీ.ఇన్ నందు పొందుపరిచామని, ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఏప్రిల్ 1వ తేదీ సాయంత్రం 5గంటల లోగా స్పందన విభాగంలో తెలియజేయాలని ఆశాఖ సహాయ సంచాలకుడు ఎం.కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు.

పోరాట యోధుడు లక్ష్మణ నాయక్

- రాష్ట్రవ్యాప్తంగా సహీద్ దివస్
- నివాళులర్పించిన నాయకులు, అధికారులు

జయపురం: ఆదివాసీ ప్రజలను చైతన్య పరిచి, దేశ స్వాతంత్య్ర పోరాటం వైపు నడిపించిన పోరాట యోధుడు సహీద్ లక్ష్మణ్ నాయక్ అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం లక్ష్మణ నాయక్ సంస్మరణ దినం సందర్భంగా జయపురం గుప్తేశ్వర కాంప్లెక్స్ ప్రాంగణంలోని విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు మదన మోహన నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మణ నాయక్ జన్మ గ్రామాన్ని పాలకులు విస్మరించారని ఆరోపించారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా, నేటికీ ఆ గ్రామానికి పక్కా రహదారి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ వినోద్ మహాపాత్రొ, కాంగ్రెస్ నాయకులు వీరేన్ పట్నాయక్ తదితరులు ప్రసంగించారు. అలాగే వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల మధ్య వకృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్, మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, డీపీఆర్‌ఓ యశోద గదబ, సమితి ఉపాధ్యక్షుడు బాలా రాయ్, గౌరవ పాత్రొ, సాధారణ కార్యదర్శి మాదవ చౌధురి, సహాయ కార్యదర్శి వెంకట్రావు పట్నాయక్, ప్రధాన ఆర్గనైజర్ హరీష్ ముదులి తదితరులు పాల్గొన్నారు.



బరంపురం: జైలు ప్రాంగణంలోని విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, మేయర్



బరంపురం: లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు, అధికారులు



జయపురం: నాయక్‌కు నివాళులర్పిస్తున్న స్మృతి సమితి సభ్యులు



రాయగడ: లక్ష్మణ్ నాయక్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న పట్టణ ప్రముఖులు



జయపురం: విజేత బాలికకు బహుమతి అందిస్తున్న అతిథులు

బరంపురం: సహిద్ లక్ష్మణ్ నాయక్ మరో అల్లూరి సీతారామరాజు అని బరంపురం ఎమ్మెల్యే విక్రమ్‌కుమార్ పండా అభిప్రాయం వ్యక్తంచేశారు. బరంపురం సర్కిల్ జైల్ ప్రాంగణంలో సహీద్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యేతోపాటు నగర మేయర్ సంఘమిత్ర దొళాయి పూలమాల వేసి, నివాళులర్పించారు. జైలులో లక్ష్మణ్ నాయక్‌ను ఉరి తీసిన ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ దేశం బ్రిటీష్ పాలనలో ఉన్న సమయంలో ఆంగ్లేయులకు సింహ స్వప్నంగా నిలిచారని కొనియాడారు. మత్తిలి పోలీస్ స్టేషన్‌పై 5వేల మంది ఆదివాసీలతో కలిసి దాడిచేసి, మువ్వన్నెల పతకాన్ని ఎగుర వేసిన దేశభక్తుడని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్కిల్ జైలు సూపరింటెండెంట్ రఘునాథ్ మాఝి, జైలర్ ఆశిష్‌కుమార్ సాహు, డీపీఆర్ బిరంచి నారాయణ్, బీడీఏ సుభాష్ మహరాణ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: ఆదివాసీ నాయకుడు, ఒడిశా వరపుత్రుడు సహీద్ లక్ష్మణ్ నాయక్‌కు జిల్లా యంత్రాంగం ఘన నివాళులర్పించింది. స్థానిక రైతు కాలనీ కూడలిలోని విగ్రహానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, ఏడీఎం ధర్మానంద బెహరా, డీపీఆర్‌ఓ బసంతకుమార్ ప్రధాన్ పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని మహిళా కళాశాల ప్రాంగణంలో ఉన్న లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి కలెక్టర్ విశాల్‌సింగ్ పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. నాయక్ పోరాటాలను గుర్తు చేసుకొని, అన్యాయాన్ని ఎదిరించడంలో ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌ఓ ప్రమిలా మాఝి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మరిచీకుండ్ జలం వేలం



ముక్తేశ్వర ఆలయ ప్రాంగణంలో పవిత్ర మరిచీ కుండ్



తొలి కలశ జలం పొందిన దంపతులతో పూజాదులు

- తొలి కలశం రూ.30 వేలకు దక్కించుకున్న భువనేశ్వర్ వాసి

భువనేశ్వర్: పట్టణంలోని ముక్తేశ్వర ఆలయం మరిచీకుండ్ జలం వేలాన్ని బుధవారం నిర్వహించారు. తొలి కలశాన్ని రూ.30 వేలకు భువనేశ్వర్‌కు చెందిన నిరంజన్ సోరెన్ భార్య మాలతీ సోరెన్ దక్కించుకున్నారు. అనంతరం ముక్తేశ్వరుని దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బొడు నియోగుల వర్గం వేలం ఈ ప్రక్రియ చేపట్టింది. బొడు నియోగ సేవాయత్ తొలి కలశం రూ.30 వేలకు, రెండో కలశం రూ.16 వేలకు వేలం వేశారు. అంగుల్‌కు చెందిన అంజలి ప్రధాన్ మూడో కలశం వేలంలో రూ.8 వేలకు కొనుగోలు చేశారు. ఈ నీళ్లతో స్నానం చేయడం వల్ల స్త్రీలకు సంతాన ప్రాప్తిస్తుందని ప్రజల నమ్మకం. ఏటా ఏకామ్ర క్షేత్రంలో లింగరాజు మహాప్రభువు రుకుణ రథయాత్ర పురస్కరించుకుని ముందు రోజు ఈ కుండం జలం వేలం వేయడం సంప్రదాయం. అంతకుముందు ఈ జలంలో యాత్ర ప్రక్రియలో భాగంగా రుకుణ రథ ప్రతిష్ట చేశారు. మారీచ్‌కుండ్ నీటితో రుకుణ రథం ప్రతిష్ట చేసిన అనంతరం నీటిని వేలం వేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వేలం ప్రక్రియ కొనసాగింది. ఈ ఏడాది 50మందికి పైగా సంతానం ఆకాంక్షిత మహిళలు వేలం ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ ప్రాంగణంలో స్థానిక పోలీసు, నగరపాలక సంస్థ(బీఎంసీ) ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ప్రత్యేక విద్యుద్దీపాలతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ఈ ప్రాంగణంలో తాత్కాలిక స్నానపు గదులు ఏర్పాటు చేశారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెట్‌కు ఎస్పీ ప్రశంసలు



నాయుడును అభినందిస్తున్న ఎస్పి ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మిడ్నాపూర్, కోల్‌కత్తాలో ఫిబ్రవరి 10 నుంచి 18 వరకు జరిగిన 42, 43వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ -2022, 2023 క్రీడా పోటీల్లో విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెచ్‌సీగా పనిచేస్తున్న వి.కృష్ణంనాయుడు విశేషప్రతిభ కనబర్చి నాలుగు బంగారు, రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ ఎం.దీపికను ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె నాయుడును అభినందించి, క్రీడాప్రతిభను ప్రశంసించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ క్రీడల పట్ల ఎంతో ఆసక్తితో సాధనచేసి జాతీయస్థాయిలో పతకాలు సాధించడం చాలా గొప్ప విషయమని, ఆయన క్రీడా స్ఫూర్తి యువతకు ఆదర్శమని ప్రశంసించారు. అనంతరం విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, రూరల్ సీఐ టీవీ.తిరుపతిరావు, ఎస్సై గణేష్‌లు నాయుడును అభినందించారు.

8 తులాల వెండి వస్తువుల చోరీ



చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

భోగాపురం: మండల కేంద్రం భోగాపురంలో మంగళవారం అర్ధరాత్రి 8 తులాల వెండి చోరీ జరిగింది. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రామిశెట్టి సాయిలక్ష్మికి ఇద్దరు కుమారులు అనంతకృష్ణ, ఉమామహేశ్వరరావు ఉన్నారు. ఉద్యోగరీత్యా పెద్ద కుమారుడు డెంకాడ మండలం మహంతిపేట, చిన్న కుమారుడు విశాఖపట్నం జిల్లా పరవాడలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం సాయిలక్ష్మి ఇంటికి తాళం వేసుకుని పెద్దకుమారుడి కుమార్తెను చూసేందుకు వెళ్లింది. ఇదే అదునుగా గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. సెల్ఫ్‌లో ఉన్న తాళాలతో బీరువాను తెరిచి అందులో 8 తులాల వెండి వస్తువులను అపహరించుకుని పారిపోయారు. బుధవారం ఉదయం సాయిలక్ష్మి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి బీరువాలో సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో బీరువాలో వెండి వస్తువులు లేకపోయేసరికి భోరుమంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సైలు కృష్ణమూర్తి, మరళీకృష్ణ(క్లూస్ టీం) సిబ్బందితో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, పలు ఆధారాలు సేకరించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 4 వరకు గడువు

నెల్లిమర్ల: జిల్లాలోని ఎంజేపీఏపీ బీసీ గురుకుల పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంలో ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 4వ తేదీవరకు గడువు ఉందని ఆ గురుకులాల కన్వీనర్ కేబీబీ రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మూడు బాలికలు, నాలుగు బాలుర పాఠశాలలున్నాయని చెప్పారు. ఆయా పాఠశాలల్లో ఐదో తరగతిలో మొత్తం 440 సీట్లున్నాయని, వాటిలో 200 బాలికల కోసం, 240 బాలుర కోసం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే నెల 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 16వ తేదీన ప్రవేశాలకు సంబంధించిన రాత పరీక్ష ఉంటుందని కన్వీనర్ తెలిపారు. పరీక్ష రాయడానికి మూడు రోజుల ముందు నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాకు చెందిన విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. అనంతరం పదోతరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టర్ నిషాంత్‌కుమార్ జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. జిల్లాలో 210 పాఠశాలలకు చెందిన 10,714 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఇందులో 5,272 మంది బాలురు, 5442 మంది బాలికలు ఉన్నట్టు చెప్పారు. వీరితోపాటు 70 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. వీరికి 64 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఏపీ ఓపెన్‌స్కూల్ పదోతరగతి పరీక్షలకు ఆరు కేంద్రాలు, ఇంటర్మీడియట్ పరీక్షలకు రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఇందులో 751 మంది పదోతరగతి, 279 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. పదోతరగతి పరీక్షల కోసం 650 మంది ఇన్విజిలేటర్లు, 12 మంది రూట్ ఆఫీసర్లు, ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులను విధిగా నడపాలని ప్రజారవాణా అధికారిని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ ఎస్‌డీవీ రమణ, డీఎస్పీ ఎ.సుభాష్, డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా రవాణా శాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డి, ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు




గాయాలపాలైన ఈశ్వరరావు, నారాయణ

జామి: మండలంలో తానవరం జంక్షన్ వద్ద రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. తానవరం గ్రామానికి చెందిన టి.నారాయణ బుధవారం రాత్రి జామి నుంచి తానవరం బైక్‌పై వెళ్తున్న సమయంలో గంధవరం గ్రామానికి చెందిన జుత్తక పైడిరాజు ఎస్.కోట నుంచి గంధవరం వెళ్తుండగా తానవరం జంక్షన్ వద్ద రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సిద్ధిధాత్రి స్వరూపంలో జగులైమాత



నవదుర్గ అలంకారంలో చిన్నారుల బృందం



జగులైమాత సిద్ధిధాత్రి స్వరూపం

భువనేశ్వర్: ఖుర్దారోడ్ కుదియారి గ్రామదేవత జగులైమాత వసంత నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఆనందోత్సాహాలతో జరుగుతున్నాయి. నవమి తిథి పురస్కరించుకుని చిన్నారులను నవదుర్గల అలంకారంతో తీర్చి దిద్ది, కుమారి పూజ నిర్వహించడం ప్రత్యేకత. చిన్నారి నవదుర్గ అలంకరణ చూడముచ్చట గొలిపింది. బుధవారం సాయంత్రం మహాస్నానం తర్వాత జగులై మాతను సిద్ధిధాత్రిగా అలంకరించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉదయం నుంచి షోడశోపచార పూజాదులతో సప్తసతి చండీ పారాయణం, ప్రత్యేక యజ్ఞం ఉత్సవ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొలిపాయి. గురువారం దశమి మిగులు కావడంతో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పూర్ణాహుతి నిర్వహించడంతో వసంత నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని కార్యదర్శి లక్ష్మీధర మహంతి తెలిపారు.

రామతీర్థంలో కల్యాణశోభ





సిద్ధమైన కల్యాణ వేదిక (ఇన్‌సెట్లో) సీతారామ చంద్రమూర్తి ఉత్సవమూర్తులు

- నేడే సీతారాముల కల్యాణోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నెల్లిమర్ల రూరల్: శ్రీరామనవమి వేడుకులకు రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానం ముస్తాబైంది. స్వామివారి కల్యాణాన్ని రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు కల్యాణ మండపాన్ని సుందరంగా అలంకరించారు. తలంబ్రాల కార్యక్రమానికి మంచి ముత్యాలతో పాటు గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సిద్ధంచేశారు. సుమారు 25వేల మంది భక్తులు కూర్చొని కల్యాణాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, చిన్నపిల్లలకు పాలు తదితర సౌకర్యాలను ఆలయ అధికారులు కల్పించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో వీఐపీలు, భక్తులకు ఎయిర్ కూలర్లను ఏర్పాటు చేశారు. సింహాచలం దేవస్థానం నుంచి తెచ్చిన పట్టు వస్త్రాలు, తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులు సమర్పించనున్నారు.

నేటి పూజా కార్యక్రమాలు ఇలా...

ఉదయం 3 గంటలకు స్వామివారికి ఆరాధన, బాలభోగం, తీర్థగోష్ఠిని నిర్వహిస్తారు. 6 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి, 6.30 గంటలకు శ్రీరామచంద్ర ప్రభువు అవతారసర్గ విన్నపం, 7 గంటలకు తేనె, నెయ్యి, ఫలరసాలు, సముద్ర నదీ జలాలతో అష్టకలశ స్నపన మహోత్సవం (అభిషేకం) కార్యక్రమాలను అర్చకులు జరిపిస్తారు. 10.30 గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం ప్రారంభమవుతుంది. ప్రత్యేకపూజలు అనంతరం సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను దేవాలయం నుంచి కల్యాణ మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి విశేష అభిషేకాలు జరిపించి స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపిస్తామని అర్చకులు తెలిపారు.

రాములోరి కల్యాణానికి మండపేట బొండాలు



మండపేట బొండాలు, గోటి తలంబ్రాలను సమర్పిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన కాజులూరి వెంకట అచ్యుత రామిరెడ్డి సమకూర్చిన కొబ్బరి బొండాలను సేవా సంఘం ప్రతినిధులు బుధవారం అర్చకులకు సమర్పించారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట నుంచి శ్రేష్టమైన బొండాలను సేకరించి వాటికి వాటర్ పెయింట్‌తో తిరునామాలు, శంఖు చక్రాలు, సీతారాముల పేర్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి రామతీర్థం చేరుకున్న పవిత్ర గోటి తలంబ్రాలను భక్తులు ప్రత్యేక ఊరేగింపు నడుమ స్వామికి సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, సేవా సంఘం ప్రతినిధులు గోవింద, విజయ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మోటార్ ట్రైసైకిల్ లబ్ధిదారుల జాబితా సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక జాబితా సిద్ధమైనట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ పీడీ ఎం.కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంయుక్త కలెక్టరు/చైర్మన్‌గా, ఏడుగురు జిల్లా అధికారులతో కూడిన కమిటీ ఆమోదించిన ఎంపిక జాబితాను జిల్లా వెబ్‌సైట్ (rri-kak u a-m.a p.g-o-v.i n)లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 1 సాయంత్రం 5 గంటల్లోగా అభ్యంతరాలు తెలియజేయవచ్చన్నారు. ఎంపిక కాని వారికి అర్హత ప్రకారం విడతల వారీగా వాహనాలు మంజూరు చేస్తామని తెలిపారు.

సూదిమొనపై రామబాణం



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో 21వ వార్డుకు చెందిన సూక్ష్మచిత్ర కళాకారుడు కొత్తపల్లి రమేష్‌ఆచారి శ్రీరామనవమి సందర్భంగా పలుచటి బంగారు రేకుపై రామబాణం తయారుచేశారు. 0.100 మిల్లీగ్రాముల బంగారాన్ని వినియోగించి 0.5 సెంటీమీటర్ల పొడవు, 1.5 సెంటీమీటర్ల వెడల్పుతో ఈ బాణాన్ని సిద్ధం చేశారు.

ఆదిత్యుని ఆదాయం రూ.50.10 లక్షలు



అనివెట్టి మండపంలో నగదు లెక్కిస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో రికార్డు స్థాయిలో రూ.50,10,437 ఆదాయం సమకూరింది. నగదు రూపంలో రూ.48,11,987 చిల్లర రూపంలో రూ.1,98,450 ఆదాయం లభించిందని ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. వీటితో పాటు 104 గ్రాముల బంగారం, 2,200 గ్రాముల వెండి వస్తువులు లభించినట్లు వెల్లడించారు. విదేశీ మారకద్రవ్యం రూపంలోనూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా దేవదాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి.వి.వి.ఆర్. ప్రసాద్ పట్నాయక్ పర్యవేక్షించగా, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలక మండలి సభ్యులు నెమలపురి కోటేశ్వర చౌదరి, ద్వారపు అనూరాధ, జలగడుగుల శ్రీనివాస్, దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్లు రవికుమార్, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వన్‌టౌన్ ఎస్సై బలివాడ గణేష్ బందోబస్తు నిర్వహించారు. గత నెల 14 నుంచి ఈ నెల 29 వరకు మొత్తం 44 రోజులకు గాను ఈ ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు. ఎప్పటిలాగే నకిలీ వెండి, బంగారం కళ్లు భారీగా బయటపడటంతో వాటిని తగులబెట్టారు.

వైద్యారోగ్య శాఖలో 39 పోస్టులు

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో ఖాళీ పోస్టులను ఒప్పంద, కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిజన్ (జిల్లా జైలు) ఆస్పత్రిలో ఫార్మాసిస్టు (గ్రేడ్-2) పోస్టు, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్‌వో) పోస్టు, ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎఫ్ఎన్‌వో) పోస్టును ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. అదే విధంగా, నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఆధ్వర్యంలో జిల్లా, జనరల్ ప్రభుత్వ ఆస్పత్రులు, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పీడియాట్రిషియన్ పోస్టు, గైనకాలజిస్టు 2 పోస్టులు, మెడికల్ ఆఫీసర్లు 22 పోస్టులు, డెంటల్ హైజనిస్టు 9 పోస్టులు, డెంటల్ టెక్నీషియన్ ఒక పోస్టు, క్లినికల్ సైకాలజిస్టు పోస్టును భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులు ఏప్రిల్ 6 సాయంత్రం 5 గంటల్లోగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరకాస్తులు అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు 'శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

భార్యపై భర్త దాడి

కొత్తూరు: భార్యపై భర్త దాడి చేసినట్టు ఫిర్యాదు అందిందని ఎస్సై ఎం.గోవింద బుధవారం తెలిపారు. మాకవరం గ్రామానికి చెందిన చీకటి కాంచనదేవి, నాయుడు దంపతులు. 12 ఏళ్లుగా తన భర్త నాయుడు మద్యం తాగి వచ్చి శారీరంగా హింసిస్తున్నాడని కాంచనదేవి ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. ఈ నెల 28 తేదీన కూడా మద్యం తాగివచ్చి కొట్టి తోసేయడంతో పక్కన ఉన్న బైక్‌పై పడిపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పకడ్బందీగా టెన్త్ పరీక్షల నిర్వహణ

శ్రీకాకుళం పాతబస్టాండ్ : పదో తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో బుధవారం వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు.కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, డీఈఓ పగడలమ్మ, సహాయ కమిషనర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి.. లాభసిద్ధి

ఆర్థిక పరిపుష్టి సాధించిన డీసీఎంఎస్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారిన దశ
- సంస్థ అభివృద్ధిపై దృష్టి పెట్టిన పాలక వర్గం
- ఇప్పటి వరకు రూ.34 లక్షల అదనపు ఆదాయం ఆర్జన



అరసవల్లిలో ఉన్న డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయం

నాడు
- టీడీపీ హయాంలో డీసీఎంఎస్‌లో జీతాలివ్వకోలేని పరిస్థితి
- కొన్ని కాంట్రాక్ట్‌లపైనే ఆధారపడ్డ దుస్థితి
- ఆక్రమణకు గురైన సంస్థ ఆస్తులు
- నిరుపయోగంగా, శిథిలావస్థకు గురైన గొడౌన్లు, భవనాలు

నేడు
- వైఎస్సార్ సీపీ పాలనలో మెరుగైన సంస్థ ఆదాయం
- ఆక్రమిత స్థలాలపై ఉక్కుపాదం.. ఎక్కడికక్కడ స్వాధీనం
- ఆదాయం పెంచుకునేందుకు పక్కాగా ప్రణాళికలు
- స్థలాల్లో సూపర్ మార్కెట్, గోదాములు, షాపుల నిర్మాణం
- అద్దెకిచ్చి అదనపు ఆదాయం సముపార్జన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఆర్థిక పరిపుష్టి సాధించింది. ఒకప్పుడు ఉద్యోగులకు జీతాలే ఇచ్చుకోలేని పరిస్థితి నుంచి నేడు అదనపు ఆదాయం ఆర్జించిన స్థితికి చేరుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పడిన పాలకవర్గం, అధికార యంత్రాంగం కృషితో ఇది సాధ్యమైందని కచ్చితంగా చెప్పవచ్చు. గతంలో కూడా అధికారులు, ఉద్యోగులున్నా సొంతంగా ఆదాయం పెంచుకునే ప్రణాళికలు పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. డీసీఎంఎస్ వివిధ ప్రభుత్వ సంస్థలకు సరుకులు సరఫరా చేసే కాంట్రాక్ట్ మాత్రమే చేసేది. అది కూడా సంబంధిత అధికారులపై ఆధారపడి ఉండేది. ఆ వచ్చిన కాంట్రాక్ట్‌లను సైతం సబ్ కాంట్రాక్ట్‌లుగా ఇచ్చేసి ప్రేక్షక పాత్ర పోషించేది. పాలకవర్గ పెద్దల సన్నిహితులకు ఆ కాంట్రాక్ట్ లిచ్చేసి, వారిచ్చే కొద్దిపాటి కమీషన్లతో సంతృప్తి చెందేది. ఈ పరిస్థితుల్లో వచ్చే ఆదాయం ఏమాత్రం సరిపోయేది కాదు. ఉద్యోగుల జీతభత్యాలు ఇవ్వుకోలేని పరిస్థితి ఏర్పడింది. కొన్నాళ్లకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతను తీసుకుంది. వీటి నిర్వహణ కోసం ప్రభుత్వమిచ్చే కమిషన్‌పై ఆధారపడాల్సి వచ్చేది. దీనివల్ల ఉద్యోగుల జీతభత్యాల సమస్య కొంత పరిష్కారమైనా సొంతంగా ఆదాయం సమకూర్చుకునే యత్నాలు జరగలేదు.

చురుగ్గా పాలకవర్గం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఏర్పాటైన పాలక వర్గం చురుగ్గా పనిచేస్తోంది. ఆదాయం సమకూర్చే మార్గాలను అన్వేషించింది. తమ కాళ్లపై నిలబడేలా సొసైటీని ముందుకు తీసుకెళ్లింది. ఎవరిపైనో ఆధారపడకుండా సొంతంగా వ్యాపార లావాదేవీలు సాగించే ప్రయత్నం చేసింది. దీంతో దాదాపు 34లక్షల అదనపు ఆదాయాన్ని సంపాదించింది. సంబంధిత ఉద్యోగులే ఆశ్చర్యపోయేలా ఆదాయ సమపార్జన చేసింది. ప్రస్తుతం 25మంది రెగ్యులర్, తాత్కాలిక, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుండగా వారంతా ఇప్పుడు ఆనందంగా పనిచేస్తున్న పరిస్థితి నెలకొంది. గతంలో జీతాలు ఎప్పుడు వస్తాయో అన్న పరిస్థితి ఉండేది. ఇప్పుడా భయం పోవడమే కాకుండా సంస్థ ఆర్థికంగా పరిపుష్టి సాధించడంతో భవిష్యత్‌పై కమ్ముకున్న నీలినీడలు తొలగిపోయాయి.

ఆక్రమణల తొలగింపుపై దృష్టి

గతంలో పాలకవర్గాలు సీరియస్‌గా పట్టించుకోకపోవడంతో చాలావరకు డీసీఎంఎస్ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆక్రమణలు తొలగించి, వాటిని ఆదాయ సంపాదనకు వినియోగించారు. శిథిలావస్థకు చేరుకున్న గొడౌన్‌లు, షాపులకు సైతం మరమ్మతులు చేయించి అద్దెకివ్వడంతో సంస్థకు భారీగా ఆదాయం సమకూరుతోంది.

తీసుకున్న చర్యల్లో కొన్ని..

- అరసవల్లిలో శిథిలావస్థకు చేరిన ఆరు గొడౌన్ల ప్రాంగణంలో ఆక్రమణలు తొలగించారు. ప్రహరీ నిర్మించి, గొడౌన్‌లకు మరమ్మతులు చేసి సరుకు నిల్వ చేసుకునేందుకు అద్దెకు ఇచ్చారు. వీటి ద్వారా రూ.6లక్షల 24వేల మేర అదనపు ఆదాయం సమకూరింది. ఇదే స్థలంలో 867 స్క్వేర్ మీటర్ల స్థలాన్ని పెట్రోలు బంకు పెట్టేందుకు హెచ్‌పీసీఎల్‌కు లీజుకిచ్చారు. దీని ద్వారా నెలకి అద్దెగా రూ.76,700 అదనపు ఆదాయం వస్తోంది.
- శ్రీకాకుళం కత్తెరవీధిలో ఆక్రమణకు గురైన 37 సెంట్ల స్థలాన్ని స్వాధీనం చేసుకుని సూపర్ మార్కెట్ నిర్మించి, ప్రారంభించారు. దీని ద్వారా రూ.60వేల వరకు అదనపు ఆదాయం వస్తోంది.
- ఆమదాలవలసలో నిరుపయోగంగా ఉన్న స్థలంలో 13 చిన్న చిన్న గదులతో నిర్మాణం చేసి, వ్యాపారులకు, వృత్తిదారులకు అద్దెకు ఇచ్చారు. వీటి ద్వారా రూ.3లక్షల 12వేల అదనపు ఆదాయం వస్తున్నది.
- ఉమ్మడి జిల్లాలోని వీరఘట్టంలో శిథిలావస్థలో ఉన్న గొడౌన్‌కు రిపేర్లు చేసి, ఐదు చిన్న గొడౌన్లుగా మార్చి అద్దెకు ఇచ్చారు. వీటి ద్వారా రూ.9లక్షల 12వేల అదనపు ఆదాయం వస్తోంది.
- మెళియాపుట్టి మండలం చాపరలో ఆక్రమణకు గురైన డీసీఎంఎస్ షాపింగ్ కాంప్లెక్స్ వెనకభాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు గొడౌన్‌లను అద్దెకిచ్చి రూ. 2లక్షల 22వేల అదనపు ఆదాయం సమకూర్చుకున్నారు.
- హిరమండలంలో గొడౌన్‌లకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలం ఆక్రమణకు గురైంది. దానిని స్వాధీనం చేసుకుని అద్దెకిచ్చారు. గొడౌన్లకు మరమ్మతులు చేయించి అద్దెకిచ్చారు. వీటి ద్వారా రూ.లక్షా 92 వేల మేర అదనపు ఆదాయం వస్తోంది.
- పాతపట్నం శివశంకర్ కాలనీలో 15 సెంట్లు, జమ్ము(నరసన్నపేట)లో 76 సెంట్లు, రణస్థలం, టెక్కలిలో ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. ఆక్రమణదారులు కొందరు కోర్టుకెళ్లడంతో న్యాయపరంగా పోరాటం చేస్తున్నారు.
- పొందూరు, రణస్థలం, పాలకొండ, మెళియాపుట్టి, ఆమదాలవలస, వీరఘట్టంలో ఉన్న మరి కొన్ని ఆస్తులను సర్వే చేసి, రెవెన్యూ పత్రాలు పొంది, ఆ ఆస్తుల రక్షణతో పాటు వాటిని వ్యాపార కేంద్రాలను మార్చు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు
- గతంలో కొనసాగుతున్న సంప్రదాయంగా ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వ సంస్థలకు, ప్రభుత్వ వసతి గృహాలకు, అంగన్‌వాడీలకు ఆహార దినుసులు, స్టేషనరీ సామగ్రి సరఫరా చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా నిర్వహిస్తున్నారు.

భవిష్యత్ కార్యాచరణ..

- మెళియాపుట్టి, పాలకొండ, హిరమండలంలోని డీసీఎంఎస్ స్థలాలను పెట్రోల్ బంకుల ఏర్పాటు కోసం అద్దెకిచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
- పొందూరు గొడౌన్ వద్ద ఐదారు షాపుల నిర్మించి అద్దెకిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.
- కత్తెర వీధిలో మూడు నాలుగు షాపులు నిర్మించి, వాటిని అద్దెకిచ్చి ఆదాయం సమకూర్చుకోనున్నారు.
- టెక్కలిలో 2.23ఎకరాల స్థలాన్ని షాపింగ్ మాల్‌కు అద్దెకివ్వడం ద్వారా లక్షలాది రూపాయల అదనపు ఆదాయం రానుంది.
- డీసీఎంఎస్ ఆఫీస్ వెనక భాగాన ఉన్న స్థలాన్ని ప్రైవేటు స్కూల్‌కు అద్దెకిచ్చే ఆలోచన చేస్తున్నారు. దీని ద్వారా రూ. 30వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



గడ్డు పరిస్థితిని అధిగమించాం

గడ్డు పరిస్థితిని అధిగమించి, సంస్థల లాభాల బాటలో పయనించేలా చర్యలు తీసుకున్నాం. ఉద్యోగులు, జిల్లా ఉన్నతాధికారులు, మంత్రులు, స్పీకర్, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో సంస్థ ఆస్తులను రక్షించడమే కాకుండా వాటి ద్వారా అదనపు ఆదాయం తీసుకురావడంలో విజయవంతమయ్యాం. సంస్థ ప్రస్తుతం ఆర్థికంగా నిలబడింది. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చెందనుంది.

– సల్లా సుగుణ దేవరాజ్, చైర్‌పర్సన్, డీసీఎంఎస్

మహిళల భద్రతకు 112 మరో అడుగు

- రాత్రివేళ సురక్షితంగా ఇంటికి చేర్చేలా 'డ్రాప్ టు హోమ్'
- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎస్పీ రాధిక





ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఒంటరిగా రాత్రివేళ ప్రయాణంలో ఇరుక్కున్న మహిళలను సురక్షితంగా ఇంటికి చేర్చేలా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఎస్పీ జి.ఆర్.రాధిక. అదే డ్రాప్ టు హోమ్. మీరు చేయాల్సిందల్లా టోల్ ఫ్రీ నంబర్ 112కు కాల్ చేయడమే. వెంటనే పోలీసులు స్పందించి తమ వాహనంలో మహిళలను వారి ఇంటి వద్ద సురక్షితంగా చేర్చుతారు. ఈ మేరకు ఎస్పీ రాధిక బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రాత్రి వేళ 11 గంటల తర్వాత ఇంటికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం లేనిపక్షంలో అధైర్య పడకుండా 112కు కాల్ చేస్తే సబ్ డివిజనల్ పరిధిలోని దిశా వాహనాలు, పోలీస్ స్టేషన్ల పరిధిలోని వాహనాల ద్వారా ఇంటికి చేరుస్తారని పేర్కొన్నారు. రాత్రిపూట ప్రయాణం చేసే మహిళలు అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, దగ్గరలో ఉన్న బస్సు, రైల్వే స్టేషన్‌లలో ఉన్న పోలీస్ ఔట్ పోస్టులు, రైల్వే పోలీసు రక్షక స్టేషన్‌లో వేచి ఉండాలని ఎస్పీ సూచించారు. ప్రతి మహిళా ఫోన్‌లో దిశా యాప్ నిక్షిప్తం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

మాదక ద్రవ్యాలపై 14500 ఫిర్యాదులకు

- మత్తు పదార్థాలు విక్రయించే షాపులపై నిఘా
- అధికారుల సమీక్షలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్. చిత్రంలో ఎస్పీ రాధిక



శ్రీకాకుళం పాతబస్టాండ్: డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఎవరు విక్రయించినా, సేవించినా టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించవచ్చని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నిరోధక శాఖ రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలుపై బుధవారం కలెక్టరెట్ సమావేశ మందిరంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ జి.ఆర్.రాధిక సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు నెలవారీ కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నిరోధించాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించాలన్నారు. అవసరమైతే స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. మత్తు కలిగించే పదార్థాలను విక్రయించే షాపులపై నిఘా పెట్టాలన్నారు. మద్యం షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మందుల షాపులు, ఇతర ట్రేడర్స్‌తో సమావేశాలు నిర్వహించి చట్టంలోని అంశాలను వివరించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరిస్తూ విద్యాసంస్థల వద్ద హోర్డింగులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎక్కడా గంజాయి పంట లేదన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వాడకం, రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 14500కు కాల్ చేయాలన్నారు. అంతకుముందు ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిరోధానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బాలరాజు, జిల్లా అటవీశాఖ అధికారి నిశాకుమారి, సెంట్రల్ ఇంటెలిజెన్స్ డీఎస్పీ కిషోర్, సేల్స్ టాక్స్ ఆఫీసర్ జి.రాణిమోహన్, అదనపు ఎస్పీ పి.విఠల్‌రావు, సీపీఓ ప్రవీణ్ కుమార్, ఆర్‌డీఓ బి.శాంతి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, డీఈఓ జి.పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల హక్కుల 14567 పరిరక్షణకు



ఎల్డర్ లైన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



టెక్కలి: వయో వృద్ధులు కుటుంబపరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా టోల్‌ఫ్రీ నంబర్ 14567కు ఫిర్యాదు చేయవచ్చని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల నిర్వహణ, తల్లిదండ్రుల పోషణ చట్టంపై బుధవారం టెక్కలి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక చట్టం ద్వారా వృద్ధుల హక్కుల పరిరక్షణకు చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం 14567 టోల్ ఫ్రీ నంబరు కలిగిన ఎల్డర్ లైన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ కిరణ్‌కుమార్, క్షేత్రస్థాయి సిబ్బంది తిరుపతిరావు, ఇన్‌చార్జి తహసీల్దారు కిషోర్, పోలీస్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా కుతారిచండీ యాత్ర

- పోటెత్తిన భక్తజనం



పూజలందుకున్న కుతారిచండీ అమ్మవారు



జాతనుక తరలివచ్చిన భక్తజనం

కవిటి: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం, కుతారిచండీ అమ్మవారి యాత్ర వింధ్యగిరి గ్రామంలో బుధవారం కన్నుల పండువగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి ఒడిశా చీకటి ప్రాంతానికి చెందిన రాజవంశీయులు కుతారిచండీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రదాయబద్ధంగా తొలిదీపం వెలగించారు. అమ్మవారి దర్శనానికి ఈ ఏడాది భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. లోకకల్యాణార్థం అమ్మవారికి చండీహోమం నిర్వహించారు. 20 వేలమంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా తదితర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 40 మంది పోలీసులతో కవిటి ఎస్సై కె.రాము బందోబస్తు నిర్వహించగా.. రాజపురం ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు.

నేరాలను నియంత్రించండి

- పోలీసు అధికారుల సమీక్షలో ఎస్పీ జి.ఆర్.రాధిక




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, ఆస్తి నేరాలను నియంత్రించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని, తరచూ రవాణాకు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టాలని, ఉపయోగించే వాహనాలను సీజ్ చేసి వ్యక్తులను అరెస్టు చేయాలన్నారు. వారి ప్రవర్తనలో మార్పు రాకుంటే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆస్తి నేరాలు జరగకుండా ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి, పగలు గస్తీ పెంచాలన్నారు. పాత కేసులో నేరస్థులపై నిఘా పెట్టాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కొత్త, అనుమానిత వ్యక్తుల గురించి ఆరా తీయాలన్నారు. వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, ఏటీఎంలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో జాతీయ రహదారి పొడవునా తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. అతివేగంగా వాహనాలను నడిపేవారిని గుర్తించి రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, ఎస్‌బీ డీఎస్పీ ఎస్.బాలరాజు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మా ఊరి దేవుడు.. కోదండ రాముడు

- శ్రీకాకుళంలో 200 ఏళ్ల నాటి రామాలయం
- పాలరాతి విగ్రహాలే ప్రత్యేకత
- నేడు సీతారాముల కల్యాణం



పాలరాతి విగ్రహాలైన సీతారాములు మూర్తులు



ఆలయం

శ్రీకాకుళం కల్చరల్: రామనవమి ఉత్సవాలకు శ్రీరాముని ఆలయాలు సిద్ధమవుతున్నాయి. జిల్లా కేంద్రంలో రెండు వందల ఏళ్లుగా కోదండ రామాలయం ఈ పుణ్యక్రతువును ఏటా నిర్వహిస్తోంది. పట్టణం నడిబొడ్డున పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం 1826లో నిర్మించినట్లు తెలుస్తోంది. ఈ ఆలయంలోని విగ్రహాలకు ఓ ప్రత్యేకత ఉంది. అన్ని ఆలయాల్లో దేవుని విగ్రహాలు దాదాపు నల్లరాతితో తయారు చేసినవే ఉంటాయి. కానీ ఇక్కడి సీతారామ,లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలు పాలరాతితో తయారు చేసినవి. వీటిని అయోధ్య నుంచి నాటుబళ్లపై శ్రీకాకుళం వరకు తీసుకువచ్చి ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది.

జీయరు స్వామి రాక..

ఈ ఆలయంలో 1962లో శ్రీరామరామానుజ జీయరు స్వామి రామ స్థూపం ఏర్పాటు చేశారు. అందులో రామకోటి పుస్తకాలను నిక్షిప్తం చేశారు. అలాగే సంక్షేమ రామాయణాన్ని పలకల మీద రాయించి పెట్టించారు. సీతారామలక్ష్మ, ఆంజనేయ సమేత మూర్తులను కూడా ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా 108 ప్రదేశాల్లో స్థూపాలను జీయరు స్వామి ఏర్పాటు చేశారు. శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన స్థూపం ఇరవై ఏడవది.

కార్యక్రమాలివే..

కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఈనెల 30నుంచి ఏప్రిల్ 6 వరకు జరుగనున్నాయి. 30న స్వామివారి కల్యాణం, రావాడ రామారావు బృందం శ్రీసీతారామ సంగీత విభావరి జరుగుతుందని ఆలయ అర్చకులు శేషాచార్యులు, ఈఓ గురునాథరావు తెలిపారు. ఏప్రిల్ 1న స్వామివారి తిరువీధి, కల్యాణం, 3న రథోత్సవం, 4న ధూపోత్సవం, 5న స్వామివారి కల్యాణం, శ్రీరామచంద్ర ప్రభువుకు పట్టాభిషేకం, ధమనోత్సవం, దర్బార్ (ఆస్థానోత్సవం), 6న పాలికోద్వాసన, పుష్పయాగం, ద్వాదశ తిరువారాధన జరుగుతుందని తెలిపారు. ఇక్కడ నిత్య కైంకర్యాలతో పూజలు చేస్తున్నామని అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు తెలిపారు.



లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన ప్రముఖ సైకత శిల్పి తరణి ప్రసాద్ మిశ్రా శ్రీరామనవమి సందర్భంగా బుధవారం వంశధార నదీతీరంలో ఇసుకతో 'జైశ్రీరామ్' సైకత శిల్పం రూపొందించారు. అద్భుత కళా నైపుణ్యంతో ఉన్న సైకత శిల్పం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. – ఎల్.ఎన్.పేట

3 నుంచి పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు ఏప్రిల్ 3 నుంచి పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 ఆర్థిక సంవత్సరం ముగింపు, 2వ తేదీ ఆదివారం కావడంతో 3వ తేదీ నుంచి పంపిణీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. లబ్ధిదారులంతా గమనించాలని కోరారు.

రామాయణంపై ఆధ్యాత్మిక ప్రవచనం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీరామ పట్టాభిషేకం అనంతతం శ్రీరామ నిర్యాణం వరకు తెలియ చెప్పే అంశాలతో కూడినది ఉత్తర రామాయణం అని వక్త రంగడు ప్రసాదరావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో రామవసంతోత్సవాలలో భాగంగా ఉత్తర రామాయణంపై ప్రవచనం బుధవారం జరిగింది. ముందుగా వక్తను మందిరం సభ్యులు సత్కరించారు.

తహసీల్దార్‌పై జేసీ ఆగ్రహం



మధుసూదనరావును హెచ్చరిస్తున్న జేసీ నవీన్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగిన ప్రత్యేక స్పందనలో పలాస, మున్సిపాలిటీకి సంబంధించి 110 సమస్యలు అధికారుల దృష్టికి వచ్చాయి. దీంతో పలాస తహసీల్దార్ మధుసూదనరావుపై జిల్లా జాయింట్ కలెక్టర ఎం.నవీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కారం చేయకుండా ఏంచేస్తున్నారని, అసలు విధులకు వెళ్తున్నారా అని ప్రశ్నించారు. కార్యాలయంలో పరిష్కారం కావాల్సినవి కూడా ఎందుకు పరిష్కరించడం లేదన్నారు. కార్యాలయంలో పనితీరుపై అనుమానాలు ఉన్నాయని ఆర్డీవో సీతారామమూర్తి, మంత్రి అప్పలరాజు సమక్షంలో క్లాస్ పీకారు. సమస్యలన్నీ తహసీల్దార్ కార్యాలయం నుంచే తలెత్తుతున్నాయన్నారు.